# వన దేవతల జన జాతర

- సమక్క-సారలమ్మ జాతరకు పోటెత్తిన భక్తులు
- సల్లంగా సూడాలని వేడుకోలు

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 23: ఆసిఫాబాద్‌లోని పెద్దవాగు తీరంలో నిర్వహిస్తున్న సమక్క-సారలమ్మ జాతరకు భక్తులు పోటెత్తారు. వనం వీడి జనంలోకి వచ్చి గద్దెలపై కొలువు దీరిన సమ్మక్క-సారలమ్మకు భక్తులు ఒడి బియ్యం, బంగారం, పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. చిన్నారులకు తలనీలాలు, ముక్కుపుడకలను కుట్టించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు వంటలు చేసుకొని సహపంక్తి భోజనాలు చేశారు. జాతర సందర్భంగా నిర్వహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా విద్యుత్, నీటి సరఫరా ఏర్పాట్లు చేశారు.

**కౌటాలలో..**

కౌటాల, ఫిబ్రవరి 23: మండల కేంద్రంలోని కంకలమ్మ గుట్ట రోడ్డులో సమ్మక్క-సారలమ్మ గద్దెల వద్ద భక్తులు పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. నిలువెత్తు బంగారాన్ని తులాభారం చేసి భక్తులకు పంచి పెట్టారు. ఈ కార్యక్రమాలు పూజారి గూడెం విమల ఆధ్వర్యంలో నిర్వహించారు.

**రెబ్బెనలో..**

రెబ్బెన, ఫిబ్రవరి 23 : లక్ష్మీపూర్ గ్రామ శివారు, దేవులగూడ, నక్కలగుడ గ్రామ శివారులో గల సమ్మక్క-సారలమ్మ గద్దెలపై కొలువుదీరడంతో భక్తులు మొక్కులు చెల్లించుకుంటున్నారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి వనదేవతలకు మొక్కులు చెల్లించుకుంటుండగా పూజారులు గొల్లపెల్లి సత్తమ్మ, దేవర వినోద్ స్వామి, ఇగురపు స్వామి భక్తులకు బెల్లం ప్రసాదాలు అందిస్తున్నారు. శనివారం సమ్మక్క సారలమ్మలు జనంలో నుంచి వనంలోకి వెళ్తుందని తెలిపారు.


కౌటాల కంకలమ్మ గుట్ట రోడ్డులో సమ్మక్క-సారలమ్మ గద్దెల వద్ద పూజలు


రెబ్బెన: లక్ష్మీపూర్ శివారులోని గద్దెల వద్ద మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు


ఆసిఫాబాద్ : పెద్దవాగు తీరంలో వనదేవతల వద్ద వంట చేసుకుంటున్న భక్తులు

## పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలి

- సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కోట శ్రీనివాస్


రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కోట శ్రీనివాస్

ఆసిఫాబాద్, ఫిబ్రవరి23 : జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కోట శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో సీపీఎం రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కార్యకలాపాల రిపోర్ట్, భవిష్యత్ కర్తవ్యాలను సభలో వివరించారు. జిల్లాలో ఆడ ప్రాజెక్ట్ కి మరమ్మతులు చేపట్టాలని కోరారు. తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత ప్రాజెక్టు పూర్తి చేస్తామని చెప్పారని, పనులు మొదలు పెట్టాలని డిమాండ్ చేశారు. తునికాకు బోనస్ పెండింగ్‌లో ఉన్నాయని వెంటనే చెల్లించాలన్నారు. మెడికల్ కాలేజీలో పూర్తి స్థాయిలో టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ భర్తీ చేయాలన్నారు. అనుబంధ జిల్లా కేంద్ర దవాఖానలో డాక్టర్ పోస్టులు, టెక్నికల్, నాన్ టెక్నికల్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. మారుమూల ఆదివాసీ గ్రామాలకు రోడ్ల విషయంలో ఫారెస్ట్ డిపార్ట్మెంట్ అనుమతులు ఇవ్వకపోవడం సరికాదని విమర్శించారు. మిగిలినా పోడు భూములకు హక్కు పత్రాలివ్వాలని కోరారు. లేదంటే పోరాటాలను ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ సీపీఎం జిల్లా కార్యదర్శి కుశన రాజన్న, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం దినకర్ తదితరులు పాల్గొన్నారు.

## హామీలు అమలు చేసి తీరుతాం

- డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్‌రావు


మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్‌రావు

రెబ్బెన, ఫిబ్రవరి 23: ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతామని కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్‌రావు స్పష్టం చేశారు. గంగాపూర్ జాతరలో విలేకరులతో ఆయన మాట్లాడారు. రుణమాఫీ చేస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటానని సవాల్ చేసి బీజేపీ నాయకుడు ఈటేల రాజేందర్ దానికి కట్టుబడి ఉండాలన్నారు. రైతు రుణమాఫీ మొత్తం ఒకే సారి అమలు చేసేందుకు కసరత్తు చేస్తున్నట్లు తెలిపారు. ఆరు గ్యారంటీలో ఇప్పటికే రెండు అమలు చేసినట్లు తెలిపారు. సంకల్ప యాత్ర పేరుతో కాంగ్రెస్ పార్టీపై మాటలతో బీజేపీ దాడి చేస్తున్నదని విమర్శించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎన్ని ఉద్యోగాలిచ్చారో చెప్పాలని ప్రశ్నించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరస్వామి కల్యాణంలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్న అనంతరం తాత్కాలిక కమిటీ సభ్యులను సన్మానించారు. మండల కేంద్రంలో మైనార్టీల కోసం ఏర్పాటు చేస్తున్న బోర్‌వెల్ పనులకు విశ్వప్రసాద్‌రావు భూమి పూజ చేశారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు లావుడ్య రమేశ్, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దుర్గం దేవాజీ గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు మోడెం సుదర్శన్‌గౌడ్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ గాజుల రవీందర్, మాజీ సర్పంచ్ ముంజం రవీందర్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అనిల్‌గౌడ్, ఐఎన్టీయూసీ నాయకుడు సంగెం ప్రకాశ్‌రావు, కమిటీ సభ్యులు జయరాం, మోడెం రాజాగౌడ్, నాయకులు మోడెం చిరంజీవిగౌడ్, గోగర్ల రాజేశ్, పూదరి హరీశ్, పూదరి సాయి, బాలునాయక్, తదితరులున్నారు.

## స్వయం సహాయక సంఘాల ఆర్థికాభివృద్ధికి కృషి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారీ
- స్వయం సహాయక సంఘాల ఆర్థిక స్థితిగతులు, పురోగతిపై ఏపీఎం, సీసీలతో సమీక్ష


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 23 : స్వయం సహాయక సంఘాలకు రుణాలు మంజూరు చేసి, వాటి ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారీ అన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, ఏపీడీ అర్క చరణ్ దాస్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ కోవ హనుమంతరావుతో కలిసి స్వయం సహాయక సంఘాల ఆర్థిక స్థితిగతులు, పురోగతిపై ఏపీఎం, సీసీలతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మహిళలతో ముఖాముఖీ సమావేశాలు నిర్వహించి సమస్యలపై చర్చించాలన్నారు. ప్రతి సంఘం ఖాతాతో బ్యాంకు లింకేజీ ప్రక్రియను వంద శాతం పూర్తి చేయాలన్నారు. స్వయం సహాయక సంఘాలు ఆర్థికంగా ఎదిగేందుకు బ్యాంకు అధికారులు, ఏపీఎంలు,సీసీలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. స్త్రీనిధి రుణాల రికవరీ ప్రక్రియ ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఎంలు రామకృష్ణ, అన్నాజీ, యశోద, యాదగిరి పాల్గొన్నారు.

## ఉపెరుగుతున్న వేసవి ఉష్ణోగ్రతలు

వాంకిడి, ఫిబ్రవరి 23 : మండల వ్యాప్తంగా నాలుగు రోజుల క్రితం చల్లగా ఉన్న వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. మండలంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు పెరగుతుండడంతో రాత్రి పూట ఉక్కపోత పెరిగింది. నాలుగు రోజుల ముందు ఉదయం, సాయంత్రం చలి గాలులు వీస్తుండేవి. ఇప్పుడు రాత్రి వేల ఉష్ణోగ్రతలు పెరిగి ఫ్యాన్లు, కూలర్లు లేనిదే ఇంట్లో ఉండలేని పరిస్థితి ఏర్పడింది. రానున్న మూడు నెలల్లో ఎండల తీవ్రత ఏ విధంగా ఉంటుందోనని మండల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

## కాంప్లెక్స్ హెచ్ఎంపై చర్యలు తీసుకోవాలి

తిర్యాణి,ఫిబ్రవరి 23: మండల పరిషత్ ఉపాధ్యాయులను వేధింపులకు గురి చేస్తున్న తిర్యాణి స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు అంజయ్యపై చర్యలు తీసుకోవాలని టీయూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు గేడం జనార్దన్ శుక్రవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. నాలుగు నెలల ప్రధానోపాధ్యాయుడు అంజయ్య బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి తిర్యాణి స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని 25 పాఠశాలల్లో పని చేస్తున్న మండల పరిషత్ ఉపాధ్యాయులకు అత్యవసర పనుల నిమిత్తం సాధారణ సెలవులివ్వకుండా ఇబ్బంది పెడుతున్నాడని ఆరోపించారు. నోటి దురుసు తనాన్ని ప్రదర్శిస్తున్నాడని తెలిపారు. ఇలాంటి చర్యలు మానుకోకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఈ సంఘం మండలాధ్యాక్షుడు కోట్నాక ప్రవీణ్ కుమార్, కోశాధికారి ఆత్రం దేవ్‌షా, సభ్యులు నైతం పర్వత్‌రావు, కొడప తిరుపతి తదితరులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## యువరైతు మరణానికి మోదీ ప్రభుత్వమే బాధ్యత వహించాలి

తిర్యాణి,ఫిబ్రవరి 23: యువరైతు మరణానికి మోడీ ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్, ప్రధాన కార్యదర్శి సింగం మొగిలి గౌడ్, రైతు బంధు సమితి మాజీ మండలాధ్యక్షుడు, ఆర్ఎస్ నాయకులు బొమ్మగోని శంకర్ గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ చుంచు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సాగిన పోరాటానికి తలొగ్గిన మోడీ ప్రభుత్వం గతంలో ఆ చట్టాలను రద్దు చేసిందన్నారు. కానీ రైతులకు కనీ స మద్దతు ధర ఇస్తామని చెప్పి నేటికి అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. నిరసనకారులపై దాడి చేయడంతో ఓ యువరైతు చనిపోయాడన్నారు. మృతి చెందిన రైతు కుటుంబానికి రూ.కోటి నష్టపరిహారం చెల్లించడంతో పాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ మండలాధ్యక్షుడు కినాక జంగు, కార్యదర్శి సత్తయ్య పాల్గొన్నట్లు తెలిపారు.

## యువ కవులకు సన్మానం



కేంద్ర సాహిత్య అకాడమీ నిర్వహణ అధికారి షణ్ముకానంద్‌తో మోతీరాం, సాయి

వాంకిడి, ఫిబ్రవరి 23 :అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం సందర్భంగా కేంద్ర సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడలోని ఆంధ్రాలయోల కళాశాలలో నిర్వహించిన అంతర్జాతీయ మాతృభాష కవి సమ్మేళనంలో వాంకిడి మండలం నగర్ గుట్ట, మోకాసిగూడ గ్రామలకు చెందిన యువ కవులు, ఆత్రం మోతీరాం, కోట్నాక సాయికుమార్, కొలామి, గోండి మాతృభాష కవితా, గానం చేసి అలరించారు. వేదికలో కేంద్ర సాహిత్య అకాడమీ కార్యక్రమాల నిర్వహణ అధికారి షణ్ముకానంద్, నాగ మల్లేశ్వరావు వారిని సమ్మెట అభినందించారు.

## ఉపాధి కూలీల అవగాహన సదస్సు


మాట్లాడుతున్న ఏపీవో నగేశ్

జైనూర్, ఫిబ్రవరి 23: అడ్డెసర, రాసిమెట్ట గ్రామాల్లో శుక్రవారం జాతీయ ఉపాధి హామీ పథకం కూలీలకు అవగాహన సదస్సు నిర్వహించారు .ఈ సందర్భంగా ఏపీవో నగేశ్ మాట్లాడుతూ జాబ్‌కార్డు కలిగి ఉన్న ప్రతి ఒక్కరికీ 100 రోజుల పని కల్పించడం జరుగుతుందన్నారు. ఈ పనిని ఉపాధి హామీ కూలీలు సద్వినియోగం చేసుకొని తమ ఆర్థికస్థితిని మెరుగుపరుచుకోవాలన్నారు. వేసవికాలంలో తగు జాగ్రతలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★హైదరాబాద్‌లో అర్జెంటుగా కొండాపూర్‌కి సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. మంచి జీతం, భోజనం, వసతి కలదు. సంప్ర: 9392663777, 9246663777, 9290003999.
NT-313897-AII

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677

## ట్యాంక్ నుంచి నీరు వృథా

వాంకిడి, ఫిబ్రవరి 23 : బంబార గ్రామంలోని ట్యాంఖ్ నుంచి నీరు వృథాగా పోతున్నది. ట్యాంక్‌పై నుంచి లీకేజీ ఉండడంతో నిండిన నీరు వృథాగా పోతున్నా స్థానిక అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం తాగు నీరు సక్రమంగా సరఫరా చేసేందుకు ఓ పక్క పకడ్బందీ చర్యలు తీసుకుంటుండగా, కింది స్థాయి సిబ్బంది పట్టించుకోవడం లేదని ప్రజల నుంచి విమర్శలు వస్తున్నాయి. శుక్రవారం ట్యాంకు నుంచి నీరు ఇలా వృథాగా పోతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఇదిలా ఉండగా మండలంలోని రాజీవ్‌నగర్‌లో 40 కుటుంబాలు ఉంటాయి. పైపులైన్ లీకేజీలతో భగీరథ నీరు రావడం లేదు. దీంతో గ్రామస్తులు చేతిపంపు నీటిపైన గ్రామా ప్రజలు ఆధారపడుతున్నారు. సంబంధిత అధికారులకు చెప్పిన స్పందన లేదని గ్రామస్తులు వాపోతున్నారు.


ట్యాంక్ నుంచి వృథాగా పోతున్న నీరు

## రైస్ మిల్లుకు తాళం


శ్రీబాలాజీ అగ్రోటెక్ రైస్ మిల్లుకు తాళాలు వేస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

సిర్పూర్(టీ), ఫిబ్రవరి 23 : వెంకట్రావ్‌పేట్ గ్రామంలోని శ్రీ బాలాజీ అగ్రోటెక్ రైస్ మిల్లుకు శుక్రవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తాళం వేశారు. గురువారం రైస్ మిల్లు తనిఖీలు నిర్వహించేందుకు వెళ్లగా, తాళం వేసి ఉండడంతో వెనుతిరిగారు. దీంతో శుక్రవారం కూడా రైస్ మిల్లుకు తాళం వేసి ఉండడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీ బాలాజీ అగ్రోటెక్ రైస్ మిల్లు, గేటుకు బయట నుంచి తాళం వేశారు. ఇదిలా ఉండగా ముందస్తు సమాచారంతోనే సదరు రైస్ మిల్లు యజమాని తాళం వేసినట్లు సమాచారం. శనివారం రైస్ మిల్లుల్లో తనిఖీలు చేపట్టనున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ శ్రీనివాస్ తెలిపారు. ఇన్‌చార్జీ తహసీల్దార్ బక్కయ్య, ఏసీఎస్‌వో వినోద్‌కుమార్, డీటీ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

## కేసుల పరిష్కారానికి కృషి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న మెజిస్ట్రేట్ అజయ్ ఉల్లం

సిర్పూర్(టీ), ఫిబ్రవరి 23 : లోక్ అదాలత్‌ల ద్వారా కేసుల పరిష్కారానికి కృషి చేయాలని సిర్పూర్(టీ) జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి అజయ్ ఉల్లం పేర్కొన్నారు. మండలకేంద్రంలోని జూనియర్ సివిల్ కోర్టులో శుక్రవారం బార్ అసోసియేషన్ న్యాయవాదులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కక్షిదారులు కోర్టుల చుట్టూ తిరగకుండా రాజీమార్గంలో కేసులు పరిష్కరించుకునేలా న్యాయవాదులు కృషి చేయాలని సూచించారు. మార్చి 9న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కిషోర్‌కుమార్, న్యాయవాదులు గణపతి, కళ్యాణ్, శ్రీనివాస్, సతీష్, అజయ్ పాల్గొన్నారు.

## ఫర్టిలైజర్స్ దుకాణాలు నిబంధనలు పాటించాలి

- డీఏవో శ్రీనివాస్‌రావు


మాట్లాడుతున్న డీఏవో శ్రీనివాస్‌రావు

వాంకిడి, ఫిబ్రవరి 23 : ఎరువులు, పురుగు మందు విక్రయాల్లో దుకాణాదారులు నిబంధనలు పాటించాలని వ్యవసాయ శాఖ(డీఏవో) జిల్లా అధికారి శ్రీనివాస్‌రావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో ఫెర్టిలైజర్స్, సీడ్స్ షాపుల వ్యాపారులతో సమావేశంలో నిర్వహించి మాట్లాడారు. అనుమతి లేని, ప్రొవిజినల్ సర్టిఫికెట్లు లైసెన్స్ లేని, గడువు ముగిసిన పురుగుల మందులు విక్రయిస్తే డీలర్ లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. విక్రయించిన వెంటనే రైతులకు రసీదు ఇవ్వాలని, కలుపు మందుకు సరైన డోస్ వివరించి రైతుకు ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో మిలింద్, ఏఈవోలు రాజేశ్వర్, వెంకటేశ్, మానస, ఫెర్టిలైజర్స్, సీడ్స్ షాపుల వ్యాపారులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలి


తహసీల్దార్‌ను సన్మానిస్తున్న ఆదివాసీ సేన నాయకులు

తిర్యాణి,ఫిబ్రవరి 23 : ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న ఆదివాసీల సమస్యలను పరిష్కరించాలని ఆదివాసీ సేన జిల్లా అధ్యక్షుడు కోట్నాక గణపతి కోరారు. ఇటీవల తిర్యాణి తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన సునీల్‌కుమార్‌ను శుక్రవారం కలిసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం మండలాధ్యక్షుడు మడవి వెంకట్‌రావు, నాయకులు టేకం రాంషా, రాయిసిడాం కృష్ణారావు పాల్గొన్నారు.

## నిత్యావసరాల అందజేత


సరుకులు అందజేస్తున్న స్వేరో సభ్యులు

బెజ్జూర్, ఫిబ్రవరి 23 : మండలంలోని బొగడగూడ గ్రామానికి చెందిన నిరుపేద జనగాం ఫకీర్‌కు శుక్రవారం స్వేరో జిల్లా అధ్యక్షుడు సురేశ్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు అందజేశారు. ఎన్ఆర్ఐ చంద్రశేఖర్ జాడే అందించిన 25 కేజీల బియ్యం, వంటనూనె, పప్పులు తదితర నిత్యావసర సరుకులను అందజేశారు. ఫకీరు భార్య, కూతురు దివ్యాంగులని, వారి పేదరికాన్ని చూసి స్పందించి సాయం చేసినట్లు తెలిపారు. మరింత మంది దాతలు ఆదుకునేందుకు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్వేరో జిల్లా వైస్ ప్రెసిడెంట్ శంకరయ్య, సభ్యులు శ్రీకాంత్, మహేందర్, రజినికాంత్, విజయ్, తిరుపతి, శ్రీనివాస్, ఛిత్రు, మల్లేశ్, దేవాజి, మహేశ్ పాల్గొన్నారు.

చింతలమానేపల్లి, ఫిబ్రవరి 23: మండల కేంద్రానికి చెందిన లోడెల్లి సుధాకర్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా శుక్రవారం ఆయన జ్ఞాపకార్థంగా కుమారుడు లోడెల్లి ప్రవీణ్ కర్జెల్లి గ్రామానికి చెందిన మండిగ గోపాల్ దంపతులు నిరుపేద కుటుంబం ఇద్దరు అంధులు కావడంతో వారికి 25 కిలోల బియ్యం, పప్పులు, బట్టలు, నిత్యావసర సరుకులు, ఇతర వస్తువులను కుటుంబ సభ్యులతో కలిసి అందజేశారు. ఆయన వెంట నాయకులు మధుకర్, బోర్కుటి వెంకన్న, దేవ్, కుటుంబ సభ్యులు ఉన్నారు.

## పీఏసీఎస్ డైరెక్టర్ మధూకర్ మృతి


పీఏసీఎస్ డైరెక్టర్ మధూకర్ (ఫైల్)

తిర్యాణి, ఫిబ్రవరి 23 : గిన్నేధరి గ్రామానికి చెందిన ఆత్రం మధుకర్ (55) పీఏసీఎస్ డైరెక్టర్ కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న పీఏసీఎస్ చైర్మన్ చుంచు శ్రీనివాస్ అతని కుటుంబ సభ్యులను పరామర్శించారు. సహకార సంఘం నుంచి చురుకైన డైరెక్టర్‌ను కోల్పోవడం చాలా బాధాకరమన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈవో భుజంగారావు, సిబ్బంది బొజ్జీరావు, పవన్‌నంద పాల్గొన్నారు.

## సీసీ రోడ్ల నిర్మాణాలకు భూమిపూజ


పనులు ప్రారంభిస్తున్న చుంచు శ్రీనివాస్, నాయకులు

తిర్యాణి, ఫిబ్రవరి 23: చింతపల్లి, ఏదులపాడ్, ఇర్కపల్లి గ్రామాల్లో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.50 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్ల నిర్మాణానికి జడ్పీటీసీ ఆత్రం చంద్రశేఖర్, పీఏసీఎస్ చైర్మన్ చుంచు శ్రీనివాస్, మండల బీఆర్ఎస్ నాయకులతో కలిసి శుక్రవారం భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ చుంచు శ్రీనివాస్, చింతపల్లి మాజీ సర్పంచ్ ఆత్రం రుక్మిణి, బీఆర్ఎస్ నాయకులు ముత్యం రాజయ్య, బొమ్మగోని శంకర్ గౌడ్, గాయంగి మల్లేశ్, తాళ్ల శ్రీనివాస్ గౌడ్, శంకరయ్య, తోట లచ్చయ్య, రమేశ్, ఆత్రం దేవ్‌షా పాల్గొన్నారు.